క్లుప్తంగా

పూలమార్కెట్లో తనిఖీలు



నెహ్రూనగర్: వ్యాపారస్తులు తప్పనిసరిగా లీగల్ మెట్రాలజీ శాఖ ద్వారా స్టాంపింగ్ వేయించుకున్న తర్వాతే తూకాల్ని వాడాలని ఆ శాఖ డెప్యూటీ కంట్రోలర్ షాలేం రాజు తెలిపారు. స్టాంపింగ్ వేయించకుండా వ్యాపారం చేసే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వరలక్ష్మి వ్రతం సందర్భంగా వినియోగదారులు ఎక్కువగా పూలు కొంటున్న నేపథ్యంలో గురువారం మార్కెట్లో తనిఖీ నిర్వహించారు. స్టాంపింగ్ నిబంధన పాటించని ఐదుగురు వ్యాపారస్తులపై కేసులు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం



గుంటూరు ఎడ్యుకేషన్: ఎన్‌సీసీ 25 ఆంధ్ర బెటాలియన్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్‌ఈ పాఠశాల విద్యార్థులకు సుబేదార్ మేజర్ మోహిత్, హవల్దార్ కృష్ణ మనోహర్ ఎన్‌సీసీ–ఏ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. లక్ష్మీపురం మెయిన్ రోడ్డులోని పాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ, దేశభక్తి అలవర్చుకోవడంలో ఎన్‌సీసీ శిక్షణ దోహదం చేస్తుందని తెలిపారు. ఎన్‌సీసీ శిక్షణ పొందడం ద్వారా భావి జీవితంలో కుటుంబపరంగా, వృత్తిపరంగా ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొనే మానసిక, శారీరక దృఢత్వాన్ని, శక్తిని విద్యార్థులకు లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ గౌరవాధ్యక్షుడు డాక్టర్ యలమంచిలి శివాజీ, పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జె. పద్మజ, వైస్ ప్రిన్సిపాల్ తేజస్విని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుంటూరు వాసి గుళ్లపల్లిలో మృతి

చెరుకుపల్లి: కొంతకాలంగా ఓ ఇంటిలో అద్దెకు ఉంటున్న పెయింటర్ అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని గుళ్లపల్లిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ వై.సురేష్ వివరాల మేరకు.. నరహరిశెట్టి కిశోర్(42) ఎనిమిది నెలలుగా గుళ్లపల్లి జెండా చెట్టు సమీపంలోని ఓ ఇంటిలో అద్దెకు ఉంటున్నాడు. పెయింట్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న అతను కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పట్టించుకునే వారు లేక బుధవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో మృతి చెందాడు. అతడి వద్ద లభించిన ఆధారాల మేరకు గుంటూరులోని నాగేశ్వరరావు వీధికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. తండ్రి రాధాకృష్ణగా సమాచారం. మృతుడి బంధువులు వివరాలు తెలియరాలేదని, వీఆర్‌వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి సంబంధించిన వారు 94409 00874, 49907 96166, 08648-247233 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

వెంకటేశ్వరరావుకు డాక్టరేట్ ప్రదానం



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ పరిశోధకుడు ఎస్. వెంకటేశ్వరరావుకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని రీసెర్చ్ సెల్ కో–ఆర్డినేటర్ డాక్టర్ పి. కిరణ్మయి తెలిపారు. ఆయన కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ పరిశోధన పర్యవేక్షకుడు ఆచార్య ఆర్. శివరామ ప్రసాద్ పర్యవేక్షణలో 'ఏ స్టడీ ఆన్ అగ్రికల్చరల్ ప్రొడక్షన్ అండ్ మార్కెటింగ్– విత్ స్పెషల్ రిఫరెన్స్ టూ ఈస్ట్ గోదావరి డిస్ట్రిక్ట్, ఆంధ్రప్రదేశ్' అనే అంశంపై పరిశోధనా గ్రంథం సమర్పించినట్లు పేర్కొన్నారు.

సీనియర్ న్యాయవాది ఐజయ్య మృతి



గుంటూరు లీగల్: నగరానికి చెందిన సీనియర్ న్యాయవాది, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు చేగూడి ఐజయ్య గురువారం హైదరాబాద్‌లో అనారోగ్యంతో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఐజయ్య కాకుమాను మండలం, తెలగాయపాలెంలో జన్మించారు. ఏసీ లా కాలేజీలో న్యాయవిద్యను అభ్యసించారు. 1988 నుంచి గుంటూరు జిల్లా కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీసు చేస్తున్నారు. ఐజయ్యకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బార్ అసోసియేషన్‌లోని న్యాయవాదులు అందరితో స్నేహశీలిగా ఉండేవారు. సివిల్, క్రిమినల్ కేసుల్లో మంచి పేరు సంపాదించారు. ఐజయ్య మృతికి గుంటూరు బార్ అసోసియేషన్ కార్యవర్గం, సీనియర్, జూనియర్ న్యాయవాదులు సంతాపం వ్యక్తం చేశారు.

వేళాపాళా లేదు.. ప్రాణాలంటే లెక్కలేదు

- ఇటీవల అధికమైన ట్రాక్టర్ ప్రమాదాలు
- నగరంలోకి అడ్డగోలుగా వస్తున్నా పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు
- జిల్లాలో సుమారు 8వేలకు పైగా ఎఫ్‌సీ లేని ట్రాక్టర్లు
- కాసుల కోసం ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న రవాణా శాఖ అధికారులు



అమరావతి రోడ్డులో యువకుడి మృతికి కారణమైన ట్రాక్టర్ (ఫైల్)



సెల్‌ఫోన్ మాట్లాడుతూ ట్రాక్టర్ నడుపుతున్న డ్రైవర్

పట్నంబజారు: అధికారుల నిర్లక్ష్యానికి ట్రాక్టర్ల ప్రమాదాలు అద్దం పడుతున్నాయి. ప్రమాదాల్లో పలువురు ప్రాణాలు కోల్పోతున్నా .. కళ్ల ముందే నిబంధనలకు తిలోదకాలిస్తున్నా ధృతరాష్ట్రుడిని తలపించేలా వ్యవహరించడంపై సర్వత్రా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న తంతును అరికట్టాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

వేలల్లో ఎఫ్‌సీ లేని ట్రాక్టర్లు

గుంటూరు జిల్లాలో మొత్తం 16,712 ట్రాక్టర్లు ఉన్నాయని అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో సుమారు 8వేలకు పైగా ట్రాక్టర్లు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు (ఎఫ్‌సీ), బ్రేక్ లేకుండా ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. స్కూల్ బస్సులు, మిగతా వాహనాలపై దృష్టి సారించిన రవాణా శాఖ అధికారులు, ట్రాక్టర్లను పట్టించుకోకపోవడంలో ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదు.

ఈ ఏడాదిలో 223 కేసులు మాత్రమే నమోదు చేశారంటే, అధికారుల నిర్లిప్తత అర్థమవుతోంది. కొంత మంది అధికారులకు నేరుగా ఆయా ట్రాక్టర్ల యజమానుల నుంచి పెద్దఎత్తున మామూళ్లు అందుతుండటంతోనే కనీసం అటువైపు చూడటంలేదనే ఆరోపణలు ఉన్నాయి. స్వర్ణభారతీనగర్‌లోని డీటీసీ కార్యాలయం ఎదురుగానే ట్రాక్టర్లు తిరుగుతున్నా, కాసుల మోజులో కన్నెత్తి చూడడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నగరంలో యథేచ్ఛగా మద్యం తాగి, సెల్‌ఫోన్లు మాట్లాడుతూ ట్రాక్టర్లను నడిపేస్తున్నారు. వారిలో సగానికి పైగా డ్రైవర్లకు లైసెన్సులు కూడా లేవని చెబుతున్నారు.

ఇవిగో దారుణాలు

- కొద్ది రోజుల కిందట ఒక హోటల్‌లో పని చేసుకునే యువకుడు అమరావతి రోడ్డులో ప్రయాణం చేస్తున్నాడు. మధ్యాహ్నం 2.30 సమయంలో అటుగా వస్తున్న ట్రాక్టర్ ఢీ కొట్టడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. ఆ ట్రాక్టర్ స్టేషన్‌కు తరలించి పరిశీలిస్తే.. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ (ఎఫ్‌సీ, బ్రేక్), ఇన్సూరెన్స్ లేకపోవడం గమనార్హం. దీంతో మృతి చెందిన బాధిత కుటుంబానికి ఎటువంటి న్యాయం జరగకపోవడం బాధాకరం.
- కొద్ది రోజుల కిందట వృద్ధ దంపతులు కారులో ప్రయాణిస్తున్న క్రమంలో పూటుగా మద్యం తాగిన ట్రాక్టర్ డ్రైవర్ వెనుక నుంచి వచ్చి కొరిటిపాడు సెంటర్‌లో ఢీకొట్టాడు. దీంతో వెనుక భాగమంతా పూర్తి నాశనమైపోయింది.
- చుట్టుగుంట సెంటర్ నుంచి లాలుపురానికి వెళ్లే వీబీపీ రోడ్డులో సైతం ఒక ట్రాక్టర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో సదరు వాహనదారుడుకు తీవ్ర గాయాలపాలయ్యాడు. అయితే, వారు రాజీ కుదుర్చుకోవడంతో ఎటువంటి కేసు నమోదు కాలేదు.
- అదే రోడ్డులో ఒక లారీ కారు ఢీకొట్టిన కేసులో, ఇప్పటికీ ఆ లారీ ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలోనే ఉంది. ఈ ఘటనలన్నీ నిబంధనలకు విరుద్ధంగా సమయాన్ని, వేళలు పాటించకుండా జరిగినవే. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 9 గంటలకు వరకు ఎటువంటి భారీ వాహనాలు రాకూడదనే నిబంధనలు ఉన్నా.. పట్టించుకునే దిక్కు లేకుండా పోయింది.

రాంగ్ రూట్‌లో ట్రాఫిక్

నగరంలో ట్రాఫిక్ విభాగం పరిస్థితి చెప్పాల్సిన పని లేదు. డబ్బులిస్తే చాలు.. ఎన్ని వాహనాలైనా సమయ వేళలు పాటించకుండా తిరగొచ్చు. ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించి సుమారు 20 వాహనాలకు మాత్రం అధికారులు నగరంలో తిరిగే అవకాశం కల్పించారు. అయితే, ఏ వాహనం గురించి అడిగినా అది ప్రభుత్వ పని కోసం అని చెప్పడం పరిపాటిగా మారింది. ఇటీవల జరిగిన ప్రమాదాలన్నీ ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల్లోపు మాత్రమే. పేరేచర్ల, అమరావతి రోడ్డు, ఇన్నర్‌రింగ్ రోడ్డు, బుడంపాడు హైవే, గుజ్జనగుండ్ల, కాకాని రోడ్డుతో మరి కొన్ని ప్రాంతాల నుంచి లారీలు, ట్రాక్టర్లు సమయ వేళలు రాకుండా నిత్యకృత్యమే. నిబంధనల్ని పాటించకపోతే చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్న మాటలు నీటిపై ''కాసు''లుగా మారిపోతున్నాయి. ఇటీవల జరిగిన ట్రాక్టర్ రోడ్డు ప్రమాదంలో రూ. 25వేలు తీసుకుని డ్రైవర్‌కు స్టేషన్ బెయిల్ ఇచ్చి సాగనంపడం గమనార్హం.

ఫిట్‌నెస్ లేకుంటే చర్యలు



ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు లేకుండా వాహనాలు తిరిగితే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించం. తనిఖీలు ముమ్మరం చేసి.. ట్రాక్టర్లకు జరిమానాలు విధిస్తాం. ఇప్పటికే పలు జరిమానాలు విధించిన పరిస్థితులు ఉన్నాయి. ఎఫ్‌సీ, త్రైమాసిక పన్నులు చెల్లించని ట్రాక్టర్‌లను సీజ్ చేస్తాం.

– షేక్ కరీం, డీటీసీ, గుంటూరు జిల్లా

చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం



సమయ వేళలు పాటించకుండా నగరంలోకి ట్రాక్టర్లు, భారీ వాహనాలు ప్రవేశిస్తే, చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. కచ్చితంగా జరిమానాలు విధించడంతో పాటు అధిక జరిమానాలు ఉంటే సీజ్ చేస్తాం. ఇప్పటికే ఈస్ట్, వెస్ట్ సబ్ డివిజన్ల సీఐలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం. ట్రాక్టర్లు సమయవేళలు పాటించేలా చర్యలు తీసుకుంటాం.

– ఎం. బాలసుందరరావు, డీఎస్పీ, ట్రాఫిక్

నగరపాలక సంస్థ కార్మికుల శ్రేయస్సే లక్ష్యం

మేయర్ కావటి, కమిషనర్ కీర్తి చేకూరి



నెహ్రూనగర్: నగరపాలక సంస్థలో విధులు నిర్వహించే అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని, ఈఎస్‌ఐ కార్డ్స్ అప్‌డేషన్ శిబిరాన్ని అవసరమైతే మరో రెండు రోజులు పొడిగించేలా చర్యలు తీసుకుంటామని నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో నిర్వహిస్తున్న ఈఎస్‌ఐ కార్డ్స్ అప్‌డేట్ శిబిరాన్ని గురువారం అదనపు కమిషనర్, డెప్యూటీ కమిషనర్లు, ఎస్‌ఈలతో కలసి పరిశీలించారు. కార్మికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈఎస్‌ఐ నూతన నిబంధనల మేరకు కార్మికులందరూ తప్పనిసరిగా తమ ఈఎస్‌ఐ కార్డ్‌ల్ని కుటుంబ సభ్యుల ఆధార్ కార్డ్‌లతో అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. శిబిరంలో సమస్యలు లేకుండా నగరపాలక సంస్థ మేనేజర్ పర్యవేక్షణ చేస్తున్నారని పేర్కొన్నారు. ఉద్యోగులతో పాటు కార్మికుల సమస్యల పరిష్కారానికి నగరపాలక సంస్థ అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఎక్కడాలేని విధంగా అవుట్ సోర్సింగ్ కార్మికులకు ఇన్స్యూరెన్స్ వార్షిక ప్రీమియాన్ని పూర్తిగా నగరపాలక సంస్థే చెల్లిస్తోందని తెలిపారు. పీఎఫ్ ఖాతాలకు సంబంధించి కొందరు కార్మికులు ఫిర్యాదులు చేశారని, వారంతా అర్జీలు అందజేస్తే త్వరలో పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పెద్దిరోజా, డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సీహెచ్.శ్రీనివాస్, డి.రవీంద్ర, ఎస్.ఈ భాస్కర్, ఎంహెచ్‌వో డాక్టర్ భాను ప్రకాష్, మేనేజర్ శివన్నారాయణ, ఎస్‌ఎస్‌లు పాల్గొన్నారు.





వరలక్ష్మి వ్రత సందడి





నగరంలో వరలక్ష్మి వ్రతం సందడి నెలకొంది. వీధులన్నీ పూల పరిమళాలతో గుబాళించాయి. పూలు, పూజ సామగ్రి కొనుగోలుకు మహిళలు భారీగా తరలివచ్చారు. బంతిపూలు, చేమంతులు, గులాబీల రేట్లు తారస్థాయికి చేరినా శక్తికొద్దీ కొనుగోలు చేశారు.

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నేతలు

పట్నంబజారు: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై ప్రతి ఒక్కరూ వైఎస్సార్ సీపీని ఆదరిస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. మంగళగిరిలోని ఆయన నివాసంలో గురువారం పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీకి చెందిన విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకులు వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి కండువాలు కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ముందుకు సాగుతున్నారని తెలిపారు. పేద వారికి తాను ఉన్నాననే భరోసా కల్పించిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ అని స్పష్టం చేశారు. విశ్వబ్రాహ్మణ కమిటీ నగర అధ్యక్షుడు కడియాల సుబ్బారావు మాట్లాడుతూ గత 15 ఏళ్లుగా తెలుగుదేశం పార్టీలో ఎంతో పనిచేశామని, అయితే తమ సామాజిక వర్గానికి ఎటువంటి మేలు జరగలేదని తెలిపారు. సీఎం వై.ఎస్.జగన్ నేతృత్వంలో విశ్వబ్రాహ్మణులకు మేలు చేకూరుతోందని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, విశ్వబ్రాహ్మణ కమిటీ నేతలు నాగేశ్వరాచారి, కె.వెంకటభాస్కర్, ఎం.శివరామకృష్ణ, కందుకూరి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. అనంతరం సజ్జల రామకృష్ణారెడ్డికి దుశ్శాలువా, పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు.



సజ్జల రామకృష్ణారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘ నేతలు. చిత్రంలో ఎమ్మెల్యే గిరి, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, మేయర్ కావటి మనోహర్‌నాయుడు

ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

ఎమ్మెల్యే ముస్తఫా



డ్రెయిన్‌లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా

పట్నంబజారు: ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా చెప్పారు. నియోజకవర్గ పరిధిలోని శివనాగరాజు కాలనీ, సంజీవయ్యనగర్ రైల్వే ట్రాక్ పరిసర ప్రాంతాల్లో గురువారం పర్యటించారు. ప్రజలతో మాట్లాడి, స్థానిక సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. ఇటీవల కురిసిన వర్షంతో దెబ్బతిన్న డ్రెయినేజీలు, రోడ్లను పరిశీలించారు. రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని, డ్రెయినేజీ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారుల్ని ఆదేశించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడుతూ ఎటువంటి సమస్యలు ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు అగ్గిపెట్టి రాజు, దాసు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు పక్కాగా జరగాలి : కమిషనర్



అధికారులతో సమావేశమైన కమిషనర్

నెహ్రూనగర్: నగరంలో వ్యర్థాల సేకరణ ప్రణాళికాబద్ధంగా జరగాలని కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. పారిశుద్ధ్య నిర్వహణపై ప్రజల నుంచి అనేక ఫిర్యాదులు అందుతున్నాయని, నిర్లక్ష్యంగా ఉండే అధికారులు, సచివాలయ కార్యదర్శులపై కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో గురువారం ప్రజారోగ్య, ఇంజినీరింగ్, హౌసింగ్ అధికారులతో పారిశుద్ధ్యం, ఈ–ఆటోల నిర్వహణ, వినియోగం, గడపగడపకు మన ప్రభుత్వం పనుల పురోగతి, జగనన్న లే– అవుట్స్‌లో ఇళ్ల నిర్మాణ పనులు తదితర అంశాలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పారిశుద్ధ్య పనులు పక్కాగా జరగాలని చెప్పారు. ఇంటింటి చెత్త సేకరణకు ఈ–ఆటోల్ని కేటాయించినా కొన్ని ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు మెరుగ్గా జరగడం లేదని, ప్రధాన రోడ్ల వెంబడి వ్యర్థాలు కుప్పలు ఉంటున్నాయని తెలిపారు. ఈ–ఆటోలను కేవలం ఇంటింటి చెత్త సేకరణకు మాత్రమే వినియోగించాలని, ఇతర వాటికి వినియోగిస్తే సంబంధిత శానిటేషన్ కార్యదర్శి, ఇన్‌స్పెక్టర్లపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నగరంలో ఇక నుంచి ఉదయం 6 గంటల నుంచే చెత్త సేకరణ ప్రారంభించాలని ఆదేశించారు. గ్యాంగ్ వర్క్ సమయంలో స్థానిక కార్పొరేటర్లతో సమన్వయం చేసుకోవాలని, గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ల వద్ద ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయించాలని సూచించారు. ఆటోల డ్రైవింగ్‌పై కార్మికులకు శిక్షణ ఇవ్వాలని తెలిపారు. ఏఈ, డీఈఈలు తమ పరిధిలోని ప్రజారోగ్య అధికారులతో సమన్వయం చేసుకొని, చార్జింగ్ పాయింట్స్, ఆటోల నిర్వహణ పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. వార్డుల వారీగా గడప గడపకు మన ప్రభుత్వంలో ఆమోదించిన అభివృద్ధి పనుల్ని ఏఈలు మరింత వేగంగా చేపట్టాలని చెప్పారు. అనంతరం జగనన్న లే అవుట్స్‌లో ఇళ్ల నిర్మాణ కాంట్రాక్టు పొందిన కాంట్రాక్టర్లు ఇచ్చిన టార్గెట్ మేరకు పనులు చేయడం లేదని, నోడల్, హౌసింగ్ అధికారులు మరింత బాధ్యతగా పర్యవేక్షణ చేయాలని కమిషనర్ ఆదేశించారు. లే అవుట్స్‌లో ఇసుక సరఫరా, రోడ్ల నిర్మాణం వంటి మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఎమినిటీ కార్యదర్శులు కూడా ఎప్పటికప్పుడు మార్కింగ్ ఇస్తూ, బిల్స్ పెండింగ్ లేకుండా అప్‌లోడ్ చేయాలని ఆమె చెప్పారు. సమావేశంలో ఎస్‌ఈ భాస్కర్, డెప్యూటీ కమిషనర్ డి.రవీంద్ర, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, ఈఈ శంకరరావు, ఎంహెచ్‌వో డాక్టర్ భాను ప్రకాష్ పాల్గొన్నారు.

కాలువలో పడి వృద్ధుడి మృతి

గుంటూరు ఈస్ట్: కాలువలో పడి వృద్ధుడు మృతి చెందిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. నగరంపాలెంలోని ఆంథోని చర్చి వెనుక మునగాల రంగారావు (75) మిషన్ కుట్టుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. గురువారం తన షాపు సమీపంలోని మురుగు కాలువలో పడి మృతి చెంది ఉన్నాడు. స్థానికులు ఆలస్యంగా గుర్తించారు. రంగారావుకు బంధువులు ఎవరూ లేరని తెలిసింది. 81వ సచివాలయం వార్డు వలంటీర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మంచం మీద నుంచి పడి ...

మంచం మీద నుంచి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఏటీ అగ్రహారంలో నివసించే కూరపాటి లూకా(32) బుధవారం మంచం మీద నుంచి కిందపడి మృతి చెందాడు. ఆలస్యంగా గుర్తించిన కుటుంబ సభ్యులు 108 అంబులెన్సులో ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి తండ్రి నరసింహారావు ఫిర్యాదు మేరకు పోలీసులు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



విద్యార్థులను అభినందిస్తున్న మరుద్వతి, నస్రీన్, వెంకటేశ్వరరావు, లక్ష్మీ ప్రసన్న

గుంటూరు ఎడ్యుకేషన్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని శ్రీ వేంకటేశ్వర బాలకుటీర్ వ్యవస్థాపకురాలు డాక్టర్ ఎన్. మంగాదేవి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ అనుబంధంగా గుంటూరు జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఇటీవల జిల్లాస్థాయిలో నిర్వహించిన యోగా పోటీల్లో బాలకుటీర్, చౌడవరం చేతన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపినట్లు పేర్కొన్నారు. అండర్–16 విభాగంలో జి. వినయ్ సాయిరాం, టి. కాశీ యశ్వంత్ ప్రథమ, ద్వితీయస్థానాల్లో, కె. హర్షవర్ధన్, ఎం. లాలా దుర్గాప్రసాద్ 4వ, 5వ స్థానాల్లో నిలిచారని వివరించారు. అండర్–10 విభాగంలో ఎన్.ప్రవల్లిక సలోమి ద్వితీయ స్థానంలో నిలిచిందని తెలిపారు. జిల్లాస్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు రాష్ట్రస్థాయిలో జరగనున్న యోగా పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. ఈ సందర్భంగా మంగాదేవి మాట్లాడుతూ యోగాను దినచర్యలో భాగంగా చేసుకుంటే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని, జీవితంలో క్రమశిక్షణ, ఏకాగ్రత అలవడతాయని తెలిపారు. శ్యామలానగర్ బాలకుటీర్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థుల్ని సీవో దుర్గా రఘురామ్, చేతన నిర్వాహకురాలు మరుద్వతి, ప్రిన్సిపాల్స్ మల్లికార్జునరావు, వెంకటేశ్వరరావు, ఎండీ నస్రీన్, లక్ష్మీ ప్రసన్న, ఉపాధ్యాయులు అభినందించారు.

గద్దర్‌కు ఘన నివాళి

తెనాలి అర్బన్: విప్లవ గాయకుడు, రచయిత గద్దర్ సంతాప సభను బీసీ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు కుర్రా శ్రీను ఆధ్వర్యంలో గురువారం తెనాలిలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థిగా ఉన్నప్పుడు గద్దర్ విప్లవ భావాలకు ఆకర్షితుడయ్యాడని తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు జొన్నాదుల వెంకటేశ్వరరావు, కౌన్సిలర్ కుర్రా సుజాత, వైఎస్సార్ సీపీ నాయకులు కాళిదాసు వెంకటేశ్వరరావు, ఎస్.ఆర్.కె. శర్మ, నరసింహారావు, మునిపల్లి వంశీ పాల్గొన్నారు.

మైదాన ప్రాంత గిరిజనులకూ రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి

నెహ్రూనగర్: రాష్ట్రంలో మైదాన ప్రాంత గిరిజనులకూ అన్ని పార్టీలు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు డాక్టర్ కొండారెడ్డి నరహరి వరప్రసాద్ విజ్ఞప్తి చేశారు. గిరిజనులు ఎదుర్కొంటున్న సామాజిక, రాజకీయ వివక్షతకు అరికట్టేందుకు నియోజకవర్గాల వారీగా శాసనసభ, పార్లమెంటు టికెట్లను కేటాయించి వారి హక్కులకు రక్షణ కల్పించాలని కోరారు. అమరావతి రోడ్డులో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజనులు నివసించే ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాల్ని మెరుగు పరచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న 25 లక్షల మంది ఎరుకల, లంబాడా తదితర గిరిజన జనాభాకు కేటాయించిన ఏడు నియోజకవర్గాలు మినహా మైదాన ప్రాంతాల్లో ఉన్న 10 లక్షల మంది ఎటువంటి రిజర్వేషన్లకు నోచుకోలేదని తెలిపారు. మైదాన ప్రాంత గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని జాతీయ ఎస్సీ ఎస్టీ కమిషన్ ఆఫ్ ఇండియా సెక్రటరీ అల్కా తివారితో పాటు పలువురు లోక్‌సభ, రాజ్యసభ సభ్యుల్ని కలసి వినతిపత్రాలు కూడా అందజేసినట్లు పేర్కొన్నారు.